క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వాల్మీకి నేతలు

కర్నూలు(అర్బన్): వాల్మీకి/ బోయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను ఆదివారం స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ భవన్‌లో వాల్మీకి నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ డా.భవానీ ప్రసాద్, హోం గార్డ్స్ రాయలసీమ కమాండెంట్ ఎస్‌పీ మహేష్‌కుమార్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివ, పశుసంవర్ధక శాఖ ఏడీ డా.మల్లన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళీనాయుడు, సంస్థ అధ్యక్షుడు తలారి క్రిష్ణ నాయుడు, గౌరవాధ్యక్షులు సత్రం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కుంపటి కృష్ణ, మహిళా విభాగం అధ్యక్షురాలు వీరమ్మ, నాయకులు రవిశంకర్, శివశంకర్, ఆర్‌బీ కృష్ణ, చిత్రసేనుడు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.మునెప్ప

కర్నూలు(సెంట్రల్): కార్మికుల తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప పిలుపునిచ్చారు.ఆదివారం ఆ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 3వ తేదీన కలెక్టరేట్ ఎదుట, 6వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 4వ తేదీన ఆటో కార్మికుల సమస్యల కోసం, 10వ తేదీన అంగన్‌వాడీల కోసం చలో విజయవాడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఎన్.కృష్ణయ్య, ట్రెజరర్ జి.చంద్రశేఖర్, నాయకులు నాగరాజు, కృష్ణమూర్తి, రాముడు, ఈశ్వర్, రమీజాబీ పాల్గొన్నారు.


జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారుడు



క్రీడాదుస్తులు అందజేస్తున్న పాధ్యాయులు దస్తగిరి రెడ్డి

కర్నూలు (టౌన్): ఈనెల 18 నుంచి 24 వ తేదీ వరకు అస్సాం రాష్ట్రంలో అండర్–23 విభాగంలో జరిగే మొదటి జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారుడు యశ్వంత్‌కుమార్ ఎంపికయ్యారు. ఆదివారం అసోసియేషన్ నాయకులు, బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధి దాదాబాషా, ఉపాధ్యాయులు దస్తగిరి రెడ్డి క్రీడాకారుడికి క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

ఉషూ పోటీల్లో కేవీఆర్ విద్యార్థినుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కుమార్


కర్నూలు (టౌన్): ఇటీవల రాజమండ్రిలో జరిగిన ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి ఉషూ పోటీల్లో కేవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. కళాశాలకు చెందిన దేవి, శ్రావణి, జయలలిత (బంగారు) చిన్న గర్గమ్మ, రాధిక, నసీమ (వెండి పతకం), నందిని (కాంస్యం)లను ప్రిన్సిపాల్ కుమార్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఉషూ మార్షల్‌ఆర్ట్స్ క్రీడల్లో రాణించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీలో పలువురికి రాష్ట్ర బాధ్యతలు


కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర రాష్ట్ర సమావేశాలు ఈనెల 1, 2 తేదీల్లో నంద్యాల జిల్లా కేంద్రంలో జరిగాయి. ఈ సందర్భంగా వీహెచ్‌పీ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల్లో రాష్ట్ర, జిల్లా నాయకుల బాధ్యతల్లో మార్పులు చేశారు. ఇందులో భాగంగా వీహెచ్‌పీ ఏపీ మీడియా కన్వీనర్‌గా భాను ప్రకాష్, రాష్ట్ర దుర్గా వాహిని కన్వీనర్‌గా ఈపూరి లక్ష్మి, రాష్ట్ర మాతృశక్తి కో కన్వీనర్‌గా జంపాల రాధిక, విశేష సంపర్క విభాగ్ కన్వీనర్‌గా నీలి నరసింహ, జిల్లా కార్యదర్శిగా ఈపూరి నాగరాజు, జిల్లా బజరంగ్ దల్ గో రక్షా ప్రముఖ్‌గా పరశురామ్‌కు బాధ్యతలు అప్పగించినట్లు వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పర్రె కోటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

వైఎస్సార్ సర్కిల్‌పై వివక్ష

- పనిచేయని ఫౌంటెన్ ● పట్టించుకోని అధికారులు
- మరమ్మతులు చేయాలని కార్పొరేటర్ల డిమాండ్



నాడు.. వైఎస్సార్ కాంస్య విగ్రహం వద్ద జలపరవళ్లు



నేడు.. నిర్వహణ లేక కళ తప్పిన వైఎస్సార్ సర్కిల్

కర్నూలు (టౌన్): ఆరోగ్య శ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, 108, జలయజ్ఞం, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు ఉచిత విద్యుత్ తదితర పథకాలకు శ్రీకారం చుట్టి విజయవంతంగా అమలు చేసిన మహానేత దివంగత వైఎస్సార్. ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పేదల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు ఆయన. అలాంటి గొప్పనేత ఫౌంటెన్ నిర్వహణలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నగరపాలక సంస్థ దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి కాంస్య విగ్రహాన్ని రూ. 10 లక్షలు వెచ్చించి స్థానిక ఎస్‌బీఐ సర్కిల్‌లో ఏర్పాటు చేసింది. తర్వాత విద్యుత్ వెలుగులతో వాటర్ ఫౌంటెన్ నిర్మించింది. క్రమంగా ఆ ప్రాంతం వైఎస్ఆర్ సర్కిల్‌గా మారింది. అయితే, కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక ఫౌంటెన్ నిర్వహణను పట్టించుకోవడం లేదు. 9 నెలల క్రితం వరకు జలసవ్వడులతో ఆకట్టుకున్న ఫౌంటెన్ నేడు కళావిహీనంగా మారింది. ఇందుకు మోటారు రిపేరు ఉందని మునిసిపల్ అధికారులు చెబుతున్నారు తప్ప బాగు చేయించడం లేదు. అరగంటలో రిపేరు చేసే పనిని నెలలుగా చేయడం లేదంటే ఉద్దేశపూర్వకంగా ఇలా చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇలాంటి వివక్ష ఉండేది కాదని, కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ సర్కిల్‌లో నాడు గ్రీనరీ పెంచి అందంగా ముస్తాబు చేసిన విషయాన్ని వైఎస్సార్ అభిమానులు గుర్తు చేస్తున్నారు. వైఎస్సార్ సర్కిల్ నిర్వహణలో నిర్లక్ష్యంపై నగరపాలక సభ్యులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు చెప్పి, కౌన్సిల్‌లోనూ సమస్యను లేవనెత్తారు. అయినా, స్పందన లేదని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖరరెడ్డికి ఇచ్చే గౌరవం ఇదేనా అని పలువురు కార్పొరేటర్లు ప్రశ్నిస్తున్నారు. దీనిపై త్వరలోనే నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

నేడు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ కాలనీల్లోని సమస్యలను ఫిర్యాదుల రూపంలో కార్యాలయంలో అందజేయవచ్చని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అర్జీదారులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబర్‌తో హాజరు కావాలని తెలిపారు.

దేశ రక్షణలో కంకణ బద్ధులు కావాలి

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరు దేశ రక్షణలో కంకణ బద్ధులు కావాలని ప్రాంత కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ పుట్టా శేషు అన్నారు. ఆదివారం ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ నగర సాంఘిక్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ సమాజ సేవతో పాటు దేశ రక్షణలో పాలు పంచుకుంటుందన్నారు. ప్రతి హిందువు దేశ భక్తి కలిగి ఉండి సంఘటితం కావాలన్నారు. ప్రముఖ వ్యాపారస్తులు జి.ఎన్.మురళీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ చాలక్ సూరా వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మెప్మా పీడీ నాగశివలీల

కర్నూలు(హాస్పిటల్): క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మెప్మా పీడీ నాగశివలీల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఎ.క్యాంపులోని మాంటిస్సోరి స్కూల్‌లో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 70 మంది మహిళలకు కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ స్పెషలిస్టు డాక్టర్ నిహారిక ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మహిళా విభా గం ఆధ్వర్యంలో విశ్వభారతి మెడికల్ కాలేజీ వారి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎస్‌పీ డీఎస్పీ మహబూబ్‌బాషా, విశ్వభారతి మెడికల్ కాలేజీ చైర్మన్ డాక్టర్ డి.కాంతారెడ్డి, రిటైర్డ్ ఈఈ నరసింహారెడ్డి, మానవత కన్వీనర్ మనోహర్‌రెడ్డి, మహిళా విభాగం కన్వీనర్ యాని ప్రతాప్, అధ్యక్షురాలు అపర్ణ, పద్మ, వైద్యులు అనిత, కార్తీక, చంద్రకళ పాల్గొన్నారు.

5న సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం

కర్నూలు(సెంట్రల్): సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఈనెల 5వ తేదీన సీఆర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య హాజరు కానున్నట్లు చెప్పారు. పెండింగ్‌లోని ప్రాజెక్టులకు బడ్జెట్లో కేటాయింపులులేకపోవడం, వలసల నివారణ, ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. కావున, కార్యవర్గ సభ్యులందరూ సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఒత్తిడిని అధిగమించి విజయం సాధించాలి



సైకాలజిస్టు జ్యోతిర్మయిని సన్మానిస్తున్న హార్ట్ ఫౌండేషన్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించి పరీక్షల్లో విజయం సాధించాలని సైకాలజిస్టు జ్యోతిర్మయి చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో స్ట్రెస్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్టు జ్యోతిర్మయి మాట్లాడుతూ ప్రస్తుతం పరీక్షల కాలం ప్రారంభమైందని, ఈ నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడికి గురిగాకుండా ప్రణాళికతో చదవాలన్నారు. పరీక్షల సమయంలో గాకుండా ముందునుంచే చదవాలన్నారు. పరీక్షల సమయంలో మాత్రమే చదివితే ఒత్తిడి పెరుగుతుందని, చదివినది కూడా గుర్తుకురాదన్నారు. బాగా చదివే వారు కూడా ఒత్తిడికి గురైతే చదివినది కూడా మరిచిపోయే అవకాశం ఉందన్నారు. ఈ ఒత్తిడిని అధిగమించేందుకు యోగా, ప్రాణాయామం, సమతుల ఆహారం, ప్రణాళికతో కూడిన అభ్యాసం తోడ్పడతాయన్నారు. ఇటీవల కాలంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఇదే సమయంలో వారు కూడా ఇంటా, బయటా సమస్యలతో ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. వారు కుటుంబంతో పాటు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, సమతుల ఆహారం తీసుకోవాలని, తగిన వ్యాయామం చేయాలని సూచించారు. అనంతరం ఆమెను హార్ట్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీప్రసాద్, కల్కూర చంద్రశేఖర్, సభ్యులు సన్మానించారు.

సంగీత గురువు రంగముని సేవలు ప్రశంసనీయం



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న అతిథులు



శాస్త్రీయ నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

కర్నూలు కల్చరల్: సంగీత గురువు రంగముని సేవలు ప్రశంసనీయమని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సంగీత గురువు రంగముని 8వ వర్ధంతి సభ జరిగింది. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, బీసీ సంఘం జాతీయ కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు, ఏపీఎస్‌పీ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా, విద్యుత్ శాఖ ఏడీఈ సుబ్బన్న, మాట్లాడారు. కందుకూరి అవార్డు అందుకోవడంతో పాటు నంది నాటక పోటీలకు సంగీత గురువుగా పనిచేసిన కీర్తి రంగమునికి దక్కుతుందన్నారు. రంగ మాధురి అధ్యక్షులు వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర తరంగిని కార్యక్రమంలో పలువురు గాయకులు శాస్త్రీయ సంగీతాన్ని ఆలపించారు. శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అలరించాయి. పలువురు కళాకారులు, సాహితీ వేత్తలను సన్మానించారు. కార్యక్రమంలో బాల సాహిత్య రచయిత హరికిషన్, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు బసవరాజు, కన్వీనర్ జేఎస్ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీలేఖ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వీపీఎస్ అధ్యక్షుడు రవికుమార్

కర్నూలు సిటీ: సి.బెళగల్ మండలం పోలకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీలేఖ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. ఆర్‌వీపీఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్య చదువుతున్న బాలికపై తల్లిదండ్రులు ఎంతో ఆశలు పెట్టుకొని చదివిస్తున్నారని, అలాంటి విద్యార్థిని చెట్టుకొమ్మ విరిగి మృతి చెందడం చాలా బాధకరమన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి మెరుగైన వైద్యంతో పాటు, లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలన్నారు. సమావేశంలో రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మదాసి కురువ సుంకన్న, ఆర్‌వీపీఎస్ నాయకులు అశోక్, వసంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తగా ఉండాలి



వృద్ధులకు గొడుగులు, చెప్పులు పంపిణీ చేస్తున్న డాక్టర్ బి.శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో వృద్ధులు, చిన్నపిల్లలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ చెప్పారు. ఆదివారం స్థానిక గాయత్రి ఎస్టేట్‌లోని శ్రీ గురుదత్త పాలిక్లినిక్‌లో జరిగిన కార్యక్రమంలో వృద్ధులకు చెప్పులు, గొడుగులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు నెలల పాటు కొనసాగే వేసవి కాలంలో ఎండవేడికి గురిగాకుండా ఉదయం 11 గంటల్లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత తమ పనులు కొనసాగించాలని, మిగత సమయంలో నీడ ప్రాంతాల్లో ఉండటం మంచిదన్నారు. ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత ఎక్కువగా స్వచ్ఛమైన నీటిని తాగాలన్నారు. లేకపోతే శరీరం డీహైడ్రేషన్‌కు గురై కిడ్నీలు విఫలమయ్యే ప్రమాదం ఉందన్నారు.

సీపీఐ నేత జేవీ సత్యనారాయణ అరెస్ట్ అక్రమం

కర్నూలు(సెంట్రల్): గత ప్రభుత్వ హయాంలో జరిగిన విశాఖ ఎల్‌జీ పాలీమర్స్‌కేసుకు సంబంధించి బాధితుల తరఫున పోరాడినందుకు పెట్టిన కేసులో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణను అరెస్టు చేయడం అక్రమం అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో చంద్రబాబునాయుడు అక్రమ కేసులను ఎత్తివేస్తామని చెప్పి ఇప్పుడు అరెస్టు చేయిస్తుండటం సరికాదన్నారు.ఈ అరెస్టును ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ప్రజా ధనాన్ని దోపిడీ చేస్తున్న వారు బయట తిరుగుతున్నారని, ప్రజా ధనాన్ని కాపాడేందుకు ప్రయత్నించిన వారిపై అక్రమ కేసుల పెట్టి అరెస్టు చేయడం బాధాకరమన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగంపై నిర్లక్ష్యం

కర్నూలు(సెంట్రల్): విద్యా రంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 10 శాతం కంటే తక్కువ విద్యా రంగానికి కేటాయింపులు చేశారన్నారు. మొత్తం బడ్జెట్లో విద్యకు రూ.32,285 కోట్లు రావాల్సి ఉండగా, పాఠశాల విద్యకు 3,185, ఉన్నత విద్యకు 2,506 కోట్లను మాత్రమే కేటాయించారని విమర్శించారు.

బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): సి. బెళగల్ మండలం పోలకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో చెట్టుకొమ్మ విరిగిపడిన సంఘటనలో చనిపోయిన విద్యార్థిని శ్రీలేఖ కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. శ్రీలేఖ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన విషయాన్ని తెలుసుకున్న వెంటనే వారు అక్కడికి వెళ్లి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ఒక్కో విద్యార్థికి లక్ష రూపాయలు సాయంగా ఇవ్వాలని కోరారు.

నేటి నుంచి ఉరుసు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో వెలసిన హజరత్ సయ్యద్ సుల్తాన్ మహమూద్‌షా ఖాద్రీ ఉరుసు మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని దర్గా పీఠాధిపతులు షఫిఅల్లాషా ఖాద్రీ, కలిముల్లాషా ఖాద్రీ ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి గంధం, మంగళవారం ఉరుసు, బుధవారం జియారత్, కిస్తీతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

రేపు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో ఈనెల 4న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు చంద్రపాల్, కిష్టఫర్ ఆదివారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు అదే రోజు సాయంత్రంలోగా రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9052216511, 6300071616 నంబర్లను సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలైనట్లు హైవే సిబ్బంది తెలిపారు. టమాట లోడ్‌తో నంద్యాల వైపు వెళ్తున్న వాహనం సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. డ్రైవర్ సరిచూసుకుంటుండగా వెనుక నుంచి వస్తున్న టిప్పర్ ఢీకొనంతో డ్రైవర్‌కు గాయాలైనట్లు తెలిపారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సీనియర్ పాత్రికేయుడు నరేష్ మృతికి సంతాపం

కర్నూలు(సెంట్రల్): సీనియర్ పాత్రికేయుడు నరేష్ యాదవ్ మృతి బాధాకరమని, ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర క్యాదర్శి మద్దిలేటి, రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, జిల్లా అధ్యక్షుడు కేబీ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో ప్రకటించారు. 1995 నుంచి వివిధ పత్రికల్లో నరేష్‌యాదవ్ జర్నలిస్టుగా పనిచేశారని, ఆయన ప్రజల తరపున ఎన్నో కథనాలు రాసి పేదలకు న్యాయం జరిగేలా చూశారన్నారు.

మహానందీశుడి దంపతులకు ఏకాంతసేవ

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు ఆదివారం రాత్రి ఏకాంతసే పూజలు నిర్వహించారు. ఈఓ నల్ల కాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు శాంతారాంభట్ స్థానిక యాగ శాలలో స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు ఆర్జిత సేవా టికెట్ల ద్వారా ఏకాంతసేవ పూజల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో



దర్గాలో ఫాతెహాలు చదువుతున్న పీఠాధిపతి సయ్యద్‌షా దాదా బాషా ఖాద్రి, తదితరులు

కర్నూలు కల్చరల్: నగరంలోని తుంగ భద్ర నది ఒడ్డున వెలసిన సయ్యద్ షా ఇషాఖీ సనావుల్లా ఖాద్రి (రోజా) దర్గా 535వ ఉరుసు ఉత్సవాలు ముగిశాయి. ఆదివారం చివరి రోజు జియారత్ ఫాతెహాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్గా కమిటీ ఏర్పాట్లు చేసింది. అంతకు ముందు దర్గా పీఠాధిపతి సయ్యద్‌షా దాదా బాషా ఖాద్రీ మాట్లాడుతూ మూడురోజుల పాటు నిర్వహించిన ఈ ఉత్సవాలకు కులమతాలకు అతీతంగా భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారన్నారు. శనివారం రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఖవ్వాలీ కార్యక్రమం జరిగిందన్నారు.

గోదా గోకులం బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న గోదా గోకులం పరివారం

కర్నూలు కల్చరల్ : శ్రీరంగనాథ స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కర్నూలు నగర శివారులోని గోదా గోకులం శ్రీగోదా రంగనాయకి సమేత శ్రీరంగనాథ స్వామి దేవాలయం ద్వితీయ వార్షిక వేడుక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు విశ్వరూప సేవ, బాల భోగ నివేదన, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, విష్వక్సేనారాధన, రక్షా బంధనం, ధ్వజాధివాసం, తదితర కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం శేషవాహన సేవ ఉంటుందని గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజుగుప్త పేర్కొన్నారు. కార్యక్రమంలో గోదా గోకులం ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాలసుధాకర్, ఇటిక్యాల పుల్లయ్య, కృష్ణ మోహన్, రాంభూపాల్ రెడ్డి, వేముల జనార్దన, రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన అవసరం




మాట్లాడుతున్న చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి

కర్నూలు కల్చరల్: విద్యార్థులకు చిన్నతనం నుంచే మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి పేర్కొన్నారు. వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో ఆదివారం బాలవికాస్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మానవ సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వాటిని సరిచేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పిల్లలను సరైన మార్గంలో పెంచితే ఉత్తమ సమాజం నిర్మితమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ద్వారా ఆటో గుర్తింపు

నందికొట్కూరు: ప్రయాణికురాలు మరిచిపోయిన బ్యాగ్ ఉన్న ఆటోను పోలీసులు సీసీ కెమెరాల సాయంతో గుర్తించారు. ఆటోను స్టేషన్‌కు తరలించి బాధితురాలికి బ్యాగ్‌ను అప్పగించారు. టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. సంగయ్య పేటకు చెందిన సరోజమ్మ స్థానిక సూపర్ మార్కెట్ వద్ద శనివారం మధ్యాహ్నం ఆటో ఎక్కి సంగయ్యపేటకు వెళ్లింది. ఆటో దిగి రెండు బ్యాగుల్లో ఒక బ్యాగును తీసుకొని ఇంట్లోకి వెళ్లింది. ఆటో డ్రైవర్ నాగన్న బ్యాగును చూసుకోకుండా వెళ్లిపోయాడు. బాధితురాలు ఇంట్లో నుంచి బయటకు వచ్చేలోపు ఆటో కనపడకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. మరోవైపు బ్యాగును చూసుకున్న ఆటో డ్రైవర్ పోలీసులకు ఇవ్వకుండా తన ఇంటికి తీసుకెళ్లాడు. దీంతో పోలీసులు ఆటోను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారించి బాధితురాలికి బ్యాగు, అందులో ఉన్న బంగారు నల్లపూసల దండను ఆదివారం అప్పగించారు.

హోరాహోరీగా ఎద్దుల బండలాగుడు పోటీలు



ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. మహాశిరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు 22 ఎద్దుల జతలు పాల్గొన్నాయి. పోటీలను టీటీడీ పాలక మండలి సభ్యులు మల్లెల రాజశేఖర్ ప్రారంభించారు. మొదటి ఎనిమిది స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.1.50 లక్షలు, రూ.1.30 లక్షలు, రూ.1.10 లక్షలు, రూ.90 వేలు, రూ.70 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు.